పెరగనున్న బెంజ్ కార్ల ధరలు!

చెన్నై, జూన్ 16: జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్-బెంజ్.. మరోసారి ధరలు పెంచడానికి సిద్ధమైంది. సెప్టెంబర్ నెల నుంచి మరోసారి ధరలను పెంచనున్నట్టు మెర్సిడెజ్-బెంజ్ ఇండియా ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. రూపాయితో పోలిస్తే యూరో విలువ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావడం వల్లనే ధరలను సవరించాల్సి వస్తున్నదని తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 1.5 శాతం చొప్పున రెండుసార్లు(జనవరి, జూన్)ధరలను సవరించిన విషయం తెలిసిందే.

డీలాపడిన ఎగుమతులు

- గత నెలలో 2.17 శాతం పతనం

న్యూఢిల్లీ, జూన్ 16: వరుసగా రెండు నెలలుగా పెరుగుతూ వచ్చిన ఎగుమతులు మళ్లీ డీలాపడ్డాయి. గడిచిన నెలకుగాను ఎగుమతులు 2.17 శాతం తగ్గాయి. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన ఎగుమతులతో పోలిస్తే 38.73 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. ఇదే నెలలో దేశీయ దిగుమతులు కూడా ఏడాది ప్రాతిపదికన 1.7 శాతం తగ్గి 60.61 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. దీంతో వాణిజ్యలోటు(ఎగుమతులు-దిగుమతుల మధ్య వ్యత్యాసం) 21.88 బిలియన్ డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే నెలలో 22.51 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు..ఏప్రిల్ నెలలో 26.42 బిలియన్ డాలర్లుగా నమోదైంది. పసిడి, క్రూడాయిల్ దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలలు(ఏప్రిల్ నుంచి మే వరకు) ఎగుమతులు 3.11 శాతం పెరిగి 77.19 బిలియన్ డాలర్లకు, దిగుమతులు 8 శాతం ఎగబాకి 125.52 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో వాణిజ్య లోటు 48.33 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, ముఖ్యంగా ఇరాన్-ఇజ్రాయిల్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో దేశీయ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. గత నెలలో బియ్యం, ఇనుప ఖనిజం, జెమ్స్ అండ్ జ్యువెల్లరీ, ఇంజినీరింగ్, పలు టెక్స్‌టైల్ ఉత్పత్తుల ఎగుమతులు ప్రతికూలానికి పడిపోయాయి. దీంతోపాటు పెట్రోలియం ప్రొడక్ట్ ఎగుమతులు కూడా 30 శాతం పడిపోయి 5.6 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఇదే నెలలో క్రూడాయిల్ దిగుమతులు 26.14 శాతం తగ్గి 14.75 బిలియన్ డాలర్లకు పరిమితమవగా, గోల్డ్ దిగుమతులు 12.6 శాతం తగ్గి 2.5 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

పరిశ్రమ రాదు.. ఉపాధి లేదు

కళతప్పిన షాద్‌నగర్ పారిశ్రామిక వాడలు.. ఉద్యోగాల్లేక విలవిల్లాడుతున్న వర్కర్లు

- బీఆర్ఎస్ హయాంలో ఎలికట్ట, పెంజర్ల, మేకగూడ, చింతగూడ, మొగిలిగిద్దలో ఇండస్ట్రీలు
- కాంగ్రెస్ పాలనలో కనిపించని ప్రభుత్వ చొరవ.. హామీలు మరిచారంటూ కార్మికుల మండిపాటు

సంఘీగూడలో పోకర్ణ టైయిల్స్ పరిశ్రమను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్ (ఫైల్), కొత్తూరు పారిశ్రామిక వాడ, అక్కడి పరిశ్రమ

షాద్‌నగర్, జూన్ 16: భారీ పరిశ్రమలకు కేంద్రంగా, వేలాది మంది కార్మికులకు కల్పతరువుగా ఉన్న షాద్‌నగర్ ప్రాంతం.. నేడు ఉసూరుమంటున్నది. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో కొత్తగా ఒక్క కంపెనీ కూడా ఏర్పాటుకాకపోవడంతో ఉపాధి అవకాశాలే కరువయ్యాయి. బీఆర్ఎస్ పాలనలో టీఎస్ఐపాస్ ద్వారా కొత్తూరు, షాద్‌నగర్ పారిశ్రామిక వాడల్లో నూతన పరిశ్రమలు వెలిశాయని కార్మికులు గుర్తుచేస్తున్నారు. స్థానికులతోపాటు దేశం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మందికి ఉపాధి లభించిందని పేర్కొంటున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వ అస్తవ్యస్థ పారిశ్రామిక విధానాలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు తగ్గుముఖంపట్టే దుస్థితి నెలకొన్నదని నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఏండ్ల తరబడి వివక్ష

షాద్‌నగర్ ప్రాంతం హైదరాబాద్‌కు సమీపంలోనే ఉన్నా దశాబ్దాల సమైక్య పాలనలో వివక్షకు గురైంది. దీంతో ఉపాధి అవకాశాలు లేక స్థానికులు వలసలు వెళ్లే దుస్థితి ఉండేది. 44వ జాతీయ రహదారి, రైలు సౌకర్యం ఉండటంతో 1976లో నాటి ప్రభుత్వం కొత్తూరు పారిశ్రామిక వాడ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. కానీ ఆశించిన స్థాయిలో స్థానికులకు ఉపాధి లభించలేదు. పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్లు ఇతర ప్రాంతాలకు చెందినవారు కావడంతో స్థానికులకు అవకాశాల్లేకుండా పోయాయి. దీంతో వలసలు పెరిగాయి. తర్వాత కొత్తూరు పారిశ్రామిక వాడతోపాటు షాద్‌నగర్, కొందర్గు, కేశంపేట మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. అయితే ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు వాటికి అండగా నిలబడలేదు. సదుపాయాలు కల్పించక, కావాల్సిన సాయం అందించక నిర్వీర్యం చేశాయి. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి షాద్‌నగర్ ప్రాంతంలో దాదాపు సగం పరిశ్రమలు మూతబడ్డాయి. ఫలితంగా వేలాది మంది కార్మికులు రోడ్డునపడ్డారు.

టీఎస్ఐపాస్‌తో పునరుజ్జీవం

కేసీఆర్ పాలనలో తీసుకొచ్చిన టీఎస్ఐపాస్‌తో షాద్‌నగర్ రూపురేఖలే మారిపోయాయి. వలసలను నివారించడంతోపాటు స్థానికులకు ఉపాధి అవకాశాలను పెంచాలనే లక్ష్యంతో, భారీ పరిశ్రమల ఏర్పాటుకు అనుమతులను నాటి సర్కారు ఇచ్చింది. పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంతో ఏటా షాద్‌నగర్‌లో నూతన పరిశ్రమలు వెలిశాయి. మైక్రోసాఫ్ట్ డాటా సెంటర్, అమెజాన్, జాన్సన్ అండ్ జాన్సన్, పీఅండ్‌జీ, ఎంఎస్ఎన్ ఫార్మా, పోకర్ణ టైయిల్స్, విజయ పాలిమర్స్, టోటల్ అయిల్ వంటి భారీ పరిశ్రమలతోపాటు 100కుపైగా ఇండస్ట్రీలు షాద్‌నగర్ ప్రాంతంలో వెలిశాయని కార్మికులు చెప్తున్నారు. టీఎస్ఐపాస్ ద్వారా కొత్తూరు, ఫరూఖ్‌నగర్, నందిగామ, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో పెద్ద ఎత్తున పరిశ్రమలు వెలిశాయి. ఫలితంగా అదనంగా దాదాపు 30వేల మందికి ఉపాధి అవకాశాలు వచ్చాయని కార్మిక సంఘాల నేతలు, అధికారులు చెప్తున్నారు. అంతేగాక తెలంగాణతోపాటు ఏపీ, కర్ణాటక, తమిళనాడు, బీహార్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, అసోం, ఒడిశా, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, రాజస్థాన్ తదితర రాష్ర్టాల నుంచి వచ్చి ఈ ప్రాంతంలో ఉపాధి పొందుతుండటం గమనార్హం.

మళ్లీ పాత రోజులవైపు..

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మళ్లీ పాత రోజులు వచ్చే ప్రమాదం ఉన్నదని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిన్నర కాలంగా ఈ ప్రాంతంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటు కాలేదని వాపోతున్నారు. కనీసం ప్రభుత్వం ఈ దిశగా చొరవ చూపినట్టు కూడా కనిపించడం లేదని ఆవేదన చెందుతున్నారు. వాస్తవానికి 1976లో పారిశ్రామిక వాడ మొదలైనా దాదాపు నాలుగు దశాబ్దాల ఉమ్మడి పాలనలో అనుకున్న స్థాయిలో షాద్‌నగర్ అభివృద్ధి చెందలేదని గుర్తుచేస్తున్నారు. పాలకుల వైఫల్యమే ఇందుకు కారణంగా చెప్తున్నారు. ఇప్పుడు కూడా మళ్లీ అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని, షాద్‌నగర్‌ను నమ్ముకొని వస్తున్న నిరుద్యోగులకు ఉపాధి దొరుకక నిరాశే మిలుగుతున్నదని పేర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి, వనరుల పెంపుపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఉద్యోగాలు ఎక్కడ?

నేను ఐటీఐ చదివాను. ఇక్కడి పరిశ్రమల్లో సరైన ఉపాధి అవకాశాలు కనిపించడం లేదు. మా ఊరు చుట్టు ప్రక్కల కొత్త పరిశ్రమలు రావడం లేదు. దీంతో ఉద్యోగాలు దొరుకడం లేదు. ప్రభుత్వం కాలుష్యం లేని పరిశ్రమలు ఏర్పాటు చేయాలి, ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

-జంగ మధు, జంగోనిగూడ,

కొత్త పరిశ్రమలు రాలే

కాంగ్రెస్ వచ్చి ఏడాదిన్నర అయ్యింది. కానీ షాద్‌నగర్ ప్రాంతంలో ఒక్క కొత్త పరిశ్రమ కూడ రాలే. నమ్ముకొని వచ్చే కార్మికుల సంఖ్య నానాటికి పెరుగుతున్నది. ఉపాధి వనరులు మాత్రం తగ్గుతున్నాయి. గతంతో పోల్చుకుంటే ఇక్కడ పరిశ్రమల ఏర్పాటు తగ్గిపోయింది.

-రాజు, సీఐటీయూ, షాద్‌నగర్

ప్రభుత్వానిదే బాధ్యత

ఉపాధి కల్పించాలంటే పరిశ్రమల ఏర్పాటు ప్రధానమైనది. బీఆర్ఎస్ పాలనలో టీఎస్ఐపాస్ విధానాన్ని ప్రవేశపెట్టి దళారి వ్యవస్థను నిర్మూలించి పారిశ్రామికవేత్తలను, పెట్టుబడి దారులను ప్రోత్సహించింది. పరిశ్రమల ఏర్పాటుకు అన్ని వసతులను సమకూర్చింది. దీంతో అప్పట్లో చాలా పరిశ్రమలు వచ్చాయి. వేలాది మందికి ఉపాధి లభించింది. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర పూర్తి కావస్తున్నా ఒక్క పరిశ్రమ కూడా రాలేదు.

-వై అంజయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్

తగ్గిన ఎస్బీఐ వడ్డీరేట్లు

న్యూఢిల్లీ, జూన్ 16: ఎస్బీఐ.. తమ రెపో లింక్డ్ లెండింగ్ రేటు (ఆర్ఎల్ఎల్ఆర్)ను అర శాతం (50 బేసిస్ పాయింట్లు) కోత పెట్టింది. ఆర్బీఐ ఇటీవలి ద్రవ్యసమీక్షలో రెపోరేటును 50 బేసిస్ పాయింట్లు తగ్గించిన నేపథ్యంలో దానికి అనుగుణంగా ఆర్ఎల్ఎల్ఆర్‌ను ఎస్బీఐ అంతే స్థాయిలో దించింది. దీంతో 8.25 శాతం నుంచి 7.75 శాతానికి దిగొచ్చింది. ఫలితంగా ఇప్పటికే బ్యాంక్ నుంచి రుణాలు తీసుకున్నవారితోపాటు కొత్తగా లోన్లకు వచ్చేవారికి వడ్డీ భారం తగ్గుతున్నది. గతవారం ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ బేస్డ్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్)నూ 50 బేసిస్ పాయింట్లు తగ్గించింది.

ఆన్‌లైన్ సేవలనే వాడుకోండి

న్యూఢిల్లీ, జూన్ 16: ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఖాతాలకు సంబంధించి ఎలాంటి సేవలనైనా అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే పొందాలని తమ సభ్యులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) సోమవారం సూచించింది. థర్డ్-పార్టీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించింది. ఇప్పటికే యూజర్-ఫ్రెండ్లీ విధానాలను అమలు చేస్తున్నామని, పారదర్శక, వేగవంతమైన సర్వీసులు అందేలా నిర్ణయాలు తీసుకుంటున్నామని కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఈ సందర్భంగా ఓ ప్రకటనలో తెలిపింది. ఈపీఎఫ్‌వోలో ప్రస్తుతం 7 కోట్లకుపైగా ఖాతాదారులున్నారు. అయితే వీరి దగ్గర్నుంచి కొందరు సైబర్ కేఫ్ ఆపరేటర్లు, కొన్ని ఫిన్‌టెక్ సంస్థలు.. ఆయా సేవలకు నగదు తీసుకుంటున్నారని ఈపీఎఫ్‌వో చెప్తున్నది. నిజానికి ఆ సర్వీసులు ఆన్‌లైన్‌లో ఉచితమేనని గుర్తుచేసింది.

మందకొడిగా సింగరేణి విస్తరణ

హైదరాబాద్, జూన్ 16 (నమస్తే తెలంగాణ) : సింగరేణి వ్యాపార విస్తరణ పనుల్లో జాప్యంపై సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పనుల్లో నిర్లక్ష్యం తగదని, మందకొడిగా పనులు కొనసాగితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. సింగరేణి భవన్ నుంచి వ్యాపార విస్తరణ పనులపై ఆయన సమీక్షించారు. మొత్తం 28 రకాల ప్రాజెక్ట్‌లపై సంబంధిత అధికారులతో చర్చించిన ఆయన..మరో పది రోజుల్లో ప్రగతి కనిపించాలని ఆదేశించారు.

బ్యాలెన్స్ చెకింగ్ పరిమితం!

త్వరలో గూగుల్ పే, ఫోన్‌పే తదితర యూపీఐ యాప్స్‌పై నిర్ణయం: ఎన్‌పీసీఐ

న్యూఢిల్లీ, జూన్ 16: గూగుల్ పే, ఫోన్‌పే తదితర యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) యాప్‌లలో ఇకపై రోజుకు వినియోగదారులు తమ ఖాతాల్లో ఉన్న నగదు నిల్వలను పరిమితంగానే చెక్ చేసుకోగలరు. ప్రస్తుతం ఎన్నిసార్లంటే అన్నిసార్లు అకౌంట్ బ్యాలెన్స్‌ను చూసుకునే వీలున్నది. ఇందుకు సంబంధించి ఎలాంటి పరిమితులూ లేవు. కానీ త్వరలో ఈ సదుపాయం ఉండబోదని సోమవారం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వెల్లడించింది. యూపీఐ సిస్టమ్‌పై పడుతున్న భారాన్ని తగ్గించడానికి రోజుకు 50 సార్లకు మించి బ్యాలెన్స్ చెకింగ్ వీలుండదని పేర్కొన్నది. అయితే ఆన్‌లైన్ మోసాలు విపరీతంగా పెరిగిన తరుణంలో ఈ ఆంక్షలు.. అమాయక కస్టమర్లకు ఇబ్బందేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అదీగాక లావాదేవీ జరిపిన ప్రతిసారీ ఖాతాలో నగదు మొత్తాలను చెక్ చేసుకోవడం చాలామందికి ఉన్న అలవాటు. కానీ ఇకపై ఈ సౌకర్యానికి బ్రేకులు పడబోతున్నాయి. కాగా, నగదు బదిలీ, స్టేటస్ చెకింగ్స్, వివిధ కారణాలతో బదిలీ అయిన మొత్తాలు తిరిగి ఖాతాల్లోకి వచ్చే సమయాలు ఇక 10 నుంచి 15 క్షణాలేనని ఎన్‌పీసీఐ తెలిపింది. ఇప్పటిదాకా ఈ సమయం 30 సెకండ్లుగా ఉన్నది. అలాగే యూపీఐ పేమెంట్‌లో వ్యాలిడేట్ అడ్రస్‌కు తీసుకునే సమయం కూడా 10 సెకండ్లేనన్నది. ప్రస్తుతం 15 సెకండ్లు పడుతున్నది.

80 ఏండ్ల తర్వాత కేజీఎఫ్‌లో మళ్లీ తవ్వకాలు

ఏటా 750 కిలోగ్రాముల బంగారం ఉత్పత్తి!

న్యూఢిల్లీ, జూన్ 16: దాదాపు 80 ఏండ్ల తర్వాత కర్నాటకలోని 'కోలార్ గోల్డ్ ఫీల్డ్స్' (కేజీఎఫ్)లో బంగారం తవ్వకాలు చేపట్టేందుకు మళ్లీ రంగం సిద్ధమవుతున్నది. అత్యంత అధునాతన మైనింగ్ పద్ధతుల్లో కేజీఎఫ్‌ను పునరుజ్జీవింప చేసేవిధంగా అడుగులు పడుతున్నాయి. భారత్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ (బీజీఎంఎల్) యాజమాన్యంలోని 1,003 ఎకరాల్లో విస్తరించిన 13 టెయిలింగ్ డంప్‌లలో ఉపరితల తవ్వకాలు చేపట్టాలన్న కేంద్రం ప్రతిపాదనకు కర్ణాటక ప్రభుత్వం ఇటీవలే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ డంప్‌లలో గతంలో జరిపిన తవ్వకాల నుండి తీసిన 3.2 కోట్ల టన్నుల ముడి ఖనిజం ఉండగా, ఇందులో 2.3 కోట్ల టన్నుల్లో బంగారం నిక్షేపాలు పుష్కలంగా ఉన్నాయని సమాచారం. దీని నుండి ఏటా 750 కిలోగ్రాముల బంగారం ఉత్పత్తి చేయవచ్చునని సమాచారం. పర్యావరణ, నిర్వహణ అనుమతులు వచ్చిన వెంటనే పూర్తిస్థాయిలో బంగారం ఉత్పత్తి మొదలవుతుందని వార్తలు వెలువడ్డాయి.

ఇది యుద్ధాల యుగం కాదు

సైప్రస్‌లో ప్రధాని మోదీ

నికోసియా, జూన్ 16: ఇది యుద్ధాలు చేసుకునే యుగం కాదన్న సంగతి సైప్రస్ అధ్యక్షుడు, తాను అంగీకరిస్తున్నామని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం పశ్చిమాసియా, యూరప్‌లో నెలకొన్న యుద్ధ సంక్షోభాలపై సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడొలిడెస్, ప్రధాని మోదీ ఇరువురూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ రెండు రోజుల సైప్రస్ పర్యటనలో భాగంగా సోమవారం అధ్యక్షుడు క్రిస్టోడొలిడెస్‌తో ముఖాముఖి చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్త మీడియా సమావేశంలో మాట్లాడారు. 'చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలి. స్థిరత్వాన్ని పునరుద్ధరించటం మానవత్వపు పిలుపు'గా ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా ప్రధాని మోదీకి సైప్రస్ ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారాన్ని అందజేసింది.

కాబోయే భార్య ఆత్మహత్య.. అంత్యక్రియలకు ముందు పెండ్లి!

యూపీలోని మహారాజ్‌గంజ్‌లో ఘటన

లక్నో, జూన్ 16: తాను వివాహం చేసుకోవాలని అనుకున్న యువతి ఆత్మహత్యకు పాల్పడటంతో, అంత్యక్రియలకు కొద్ది గంటల ముందు కాబోయే భర్త ఆమెను వివాహం చేసుకున్న ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లాలో చోటుచేసుకుంది. అంతేగాక ఆమె అంత్యక్రియల్ని కూడా తన చేతులమీదుగా కాబోయే భర్త పూర్తిచేశాడు. సన్నీ మాదేసియా అనే వ్యక్తితో స్వల్ప వాగ్వాదం తర్వాత ఆదివారం రాత్రి ప్రియాంక (23) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడినట్టు అనుమానాలు ఉన్నాయి. అయితే, ఆమె కుటుంబ సభ్యులు అతడిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదు. సోమవారం ఉదయం ఆమె అంత్యక్రియలకు ఏర్పాట్లు జరుగుతుండగా, స్థానిక పూజారితో వచ్చిన సన్నీ మాదేసియా.. ఆమె నుదిటిపై సిందూరం దిద్దాడు. పూజారి పెండ్లి మంత్రాలు చదువుతుండగా..వివాహ తంతును తలపించేలా, మృతదేహం చుట్టూ ఏడు చుట్లు తిరిగాడు. చుట్టూ ఉన్నవారంతా ఈ తతంగాన్ని ఆశ్చర్యపోతూ చూస్తూ ఉండిపోయారు. 'ఆమె చివరి కోరికను తీర్చడానికి ఇది నా మార్గం. నేను ఆమెను చాలా ప్రేమించాను' అని సన్నీ అన్నాడు. ఆమెను తన భార్యగా చేసుకోవాలని అనుకున్నానని చెప్పాడు.

'ఉపాధి'కి కేంద్రం పాతర!

నిధుల ఖర్చుపై మోదీ సర్కారు పరిమితులు

- మొత్తం కేటాయింపుల్లో 60 శాతం మాత్రమే మొదటి ఆరు నెలల్లో ఖర్చు చేయాలని నిబంధన
- పరిమితి దాటితే ఏం చేయాలో తెలియని సందిగ్ధత
- కేంద్రం నిర్ణయంపై ఉపాధి కూలీలు, విపక్షాల ధ్వజం

న్యూఢిల్లీ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కేంద్రంలోని మోదీ సర్కారు క్రమంగా పాతరేస్తున్నది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పలు రకాల ఆంక్షలు విధిస్తూ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నది. తాజాగా మరో కొర్రీ పెట్టింది. పథకానికి కేటాయించిన నిధులను ఖర్చు చేసే విధానంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిమితులను విధించింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన మొత్తంలో 60 శాతం వరకు మాత్రమే మొదటి ఆరు నెలల్లో ఖర్చు చేయాలని తెలిపింది. దీనిపై ప్రజా సంఘాలు, ఈ పథకం లబ్ధిదారుల సంఘాలు, విపక్షాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఎందుకు ఈ పరిమితి?

కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, కొన్ని సంవత్సరాలుగా ఈ పథకానికి కేటాయించిన వార్షిక బడ్జెట్‌లో దాదాపు 70 శాతానికిపైగా సెప్టెంబరునాటికే ఖర్చయిపోతున్నది. డిసెంబరులో అనుబంధ కేటాయింపులు జరిపినప్పటికీ, జనవరికల్లా ఖర్చయిపోతున్నాయి. ఫలితంగా ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేసరికి బాకీలు పెండింగ్‌లో పడుతున్నాయి. గడచిన ఐదు ఆర్థిక సంవత్సరాల్లో పెండింగ్ బాకీలు రూ.15,000 కోట్ల నుంచి రూ.25,000 కోట్ల మధ్యలో ఉంటున్నాయి. తదుపరి ఆర్థిక సంవత్సరంలో కేటాయించే బడ్జెట్‌లో సగటున 20 శాతం వరకు ఈ బాకీల చెల్లింపులకే సరిపోతున్నది. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ పథకం కింద ఖర్చులపై పరిమితి విధించడం ద్వారా ఆర్థిక సంవత్సరంలో రెండో సగ భాగానికి నిధులు అందుబాటులో ఉండేలా చేయవచ్చు. దీని వల్ల అదనపు కేటాయింపుల అవసరం ఉండదు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కోసం కేంద్రం రూ.86,000 కోట్లు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో బాకీలు రూ.21,000 కోట్లు. 2025-26 బడ్జెట్‌లో 28 శాతం నిధులను కేంద్రం జూన్ 12 నాటికి విడుదల చేసింది. 2025-26లో బాకీలు రూ.3,262 కోట్లు, కేవలం ఈ బాకీలను చెల్లిస్తే, బడ్జెట్‌లో సుమారు 50 శాతం ఖర్చయిపోతుంది.

ఖర్చులపై పరిమితితో సమస్యలు

ఉపాధి హామీ పథకం కింద పని కోసం డిమాండ్ ఏడాది పొడవునా ఒకే విధంగా ఉండదు. వ్యవసాయ కార్యకలాపాలు, వాతావరణ పరిస్థితులను బట్టి ఒక్కొక్క నెలలో ఒక్కొక్క విధంగా ఉంటుంది. ఉపాధి హామీ పథకాన్ని ఎంజీఎన్ఆర్ఈజీ చట్టం, 2005 ప్రకారం అమలు చేస్తున్నారు. ఈ చట్టాన్ని అమలు చేసే విధివిధానాలను నిర్ణయించే అధికారం మాత్రమే ప్రభుత్వానికి ఉంది. అయితే, ఈ అధికార పరిధి పరిమితం.

జవాబులేని ప్రశ్నలు

వార్షిక బడ్జెట్‌లో 60 శాతం పరిమితిని చేరుకున్న తర్వాత ఏం చేయాలనే దానిపై స్పష్టత లేదు. కూలీలు డిమాండ్ చేసినప్పటికీ ఉపాధిని నిరాకరించే పరిస్థితులు రాష్ట్ర ప్రభుత్వాలకు రావచ్చు. లేదంటే, సకాలంలో చెల్లింపులు జరపకపోయినప్పటికీ పని చేయవలసిన పరిస్థితి కూలీలకు రావచ్చు. డిమాండ్ చేసిన 15 రోజుల్లోగా ఉపాధి పొందడం, పని పూర్తయిన తర్వాత 15 రోజుల్లోగా వేతనాలను పొందడం కూలీల హక్కులు. ఆర్థిక శాఖ నిర్ణయం వల్ల ఈ చట్టం స్ఫూర్తికి విఘాతం కలుగుతున్నది.

ఐపీఎల్ ఫ్లడ్ లైట్లను హ్యాక్ చేశాం!

పాక్ మంత్రి వ్యాఖ్యలు.. నెటిజన్ల ట్రోలింగ్

ఇస్లామాబాద్: పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తన వింత వ్యాఖ్యలతో మరోసారి నవ్వుల పాలయ్యారు. భారత్‌లో జరిగిన ఓ ఐపీఎల్ మ్యాచ్‌లో ఫ్లడ్‌లైట్లను తమ దేశ సైబర్ యోధులు హ్యాక్ చేశారని చెప్పి నెటిజన్ల చేతిలో విపరీతంగా ఆయన ట్రోల్‌కు గురయ్యారు. పాక్ జాతీయ అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. 'ఇదంతా పాక్ స్వదేశీ సాంకేతికత వల్ల జరిగిందనే విషయాన్ని ఇండియా అర్థం చేసుకోవడం లేదు. మా సైబర్ యోధులు భారత్‌పై దాడి చేసి ఓ క్రికెట్ స్టేడియంలోని విద్యుత్తు దీపాలను ఆర్పేశారు. దీంతో అక్కడ జరుగుతున్న ఐపీఎల్ మ్యాచ్ ఆగిపోయింది. భారత్ వంతెనల నుంచి నీళ్లు విడుదలయ్యాయి' అని ఆయన వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టినప్పుడు, మే 8న ధర్మశాలలో జరిగిన మ్యాచ్ గురించి ఆసిఫ్ వ్యాఖ్యానించి ఉండొచ్చని భావిస్తున్నారు. అయితే ఆసిఫ్ వ్యాఖ్యలపై నెటిజన్లు వ్యంగ్యంగా స్పందించారు.

వాట్సాప్‌లో త్వరలో యాడ్స్!

అప్‌డేట్స్ ట్యాబ్‌లో ఇకపై ప్రకటనలు

కాలిఫోర్నియా: భారతీయులు పెద్ద సంఖ్యలో వాడుతున్న ప్రముఖ మెసేజింగ్ యాప్ 'వాట్సాప్' వినియోగంపై 'మెటా' కీలక ప్రకటన చేసింది. మరికొద్ది నెలల్లో వాట్సాప్‌లో ప్రకటనలు(యాడ్స్), సబ్‌స్క్రిప్షన్ ప్రవేశపెడుతున్నామని వాట్సాప్ మాతృ సంస్థ 'మెటా' సోమవారం ప్రకటించింది. ఇకపై యాప్‌లోని అప్‌డేట్స్ ట్యాబ్‌లో అడ్వర్టైజ్‌మెంట్‌కు సంబంధించిన ఫీచర్లు తీసుకురానున్నట్టు తన బ్లాగ్‌పోస్టులో వాట్సాప్ వెల్లడించింది. అప్‌డేట్స్ ట్యాబ్‌లో చానళ్లు, స్టేటస్ విభాగాల్లో ఇవి కనిపించనున్నాయి. యాప్ వాడేవారిలో 150 కోట్ల మంది రోజూ ఈ అప్‌డేట్స్ ట్యాబ్ చూస్తుంటారని అంచనా. ఈ నేపథ్యంలో అడ్మిన్లకు, ఆర్గనైజర్లకు, వ్యాపారులకు యాప్ ద్వారా ఎదిగేందుకు అవకాశం కల్పించేలా ప్రకటనలు తీసుకొస్తున్నట్టు వాట్సాప్ తెలిపింది. ఛానల్ సబ్‌స్క్రిప్షన్: నెలవారీ ఫీజు చెల్లించి మీకు ఇష్టమైన చానల్‌కు సపోర్ట్ చేయొచ్చు. ప్రమోటెడ్ ఛానల్: ప్రస్తుతం ఛానల్స్‌ను ఎక్స్‌ప్లోర్స్ చేస్తే ట్రెండింగ్‌లో ఉన్నవి మాత్రమే కనిపిస్తాయి. ఇకపై అడ్మిన్లు కొంత మొత్తం చెల్లించి తమ ఛానల్‌ను ప్రమోట్ చేసుకోవచ్చు.

ట్రంప్ మొబైల్ ఫోన్లు రాబోతున్నాయ్!

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కుటుంబం మొబైల్ ఫోన్ల రంగంలోకి అడుగు పెట్టింది. 'ది ట్రంప్ ఆర్గనైజేషన్' నిర్వాహకుల్లో ఒకరైన ఎరిక్ ట్రంప్ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికాలో మొబైల్ ఫోన్ సర్వీస్‌కు ట్రంప్ పేరును వాడుకోవడానికి లైసెన్స్ ఇచ్చారు. ట్రంప్ మొబైల్ పేరుతో ఏర్పాటు చేసిన వెంచర్ ద్వారా అమెరికాలో ఫోన్లను విక్రయిస్తారు. బంగారు రంగులోని టీ1 మొబైల్ ఆగస్టు నుంచి ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. దీనిని వేరొక కంపెనీ డిజైన్ చేసి, తయారు చేస్తుంది. ఈ వెంచర్ ద్వారా ఓ కాల్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తారు. ఈ ఫోన్, సర్వీస్‌లను టీ1 మొబైల్ అని పిలుస్తారు. అమెరికాలో అమ్ముకునే ఫోన్లను భారత్‌లో తయారు చేయాలని యాపిల్ నిర్ణయించడాన్ని ట్రంప్ తప్పుబట్టారు.

ఇకపై అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్

న్యూఢిల్లీ: ఎన్నికల్లో ఇకపై అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్‌ను అమలు చేయాలని ఎన్నికల కమిషన్ సోమవారం నిర్ణయించింది. ఇప్పటి వరకు సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లతోపాటు మొత్తంగా 50 శాతం పోలింగ్ స్టేషన్లలో మాత్రమే వెబ్‌కాస్టింగ్ విధానాన్ని అమలు చేస్తున్నది. దీనిని వంద శాతం పోలింగ్ స్టేషన్లకు విస్తరించాలని నిర్ణయించింది. ఈ డాటాను అంతర్గత వినియోగం కోసం ఉపయోగిస్తారు. బీహార్ శాసనసభ ఎన్నికలు కొన్ని నెలల్లో జరుగుతాయి. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌కాస్టింగ్ అమలయ్యే మొదటి రాష్ట్రం ఇదే అవుతుంది.

ప్రయాణికుడిగా కాదు, 'పార్శిల్'గా ప్రయాణం!

బెంగళూరు: కర్ణాటక హైకోర్టు ఆదేశాల మేరకు బైక్ ట్యాక్సీలు సోమవారం నుంచి అందుబాటులో లేవు. అయితే, ర్యాపిడో యాప్‌లో 'బైక్ ట్యాక్సీ' ఆప్షన్ స్థానంలో 'బైక్ పార్శిల్' సర్వీసును ప్రారంభించింది.దీనిపై నెటిజన్లు సెటైర్లు వేస్తున్నారు. ర్యాపిడో యాజమాన్యం చట్టాన్ని పక్కనపడేసిందని, బైక్ రైడ్‌ను బుక్ చేసుకోలేకపోతే, బాధపడవద్దని, మిమ్మల్ని మీరు పార్శిల్ చేసుకుని కార్యాలయాలకు వెళ్లమని చెప్తున్నదని జోకులు వేస్తున్నారు.

క్యారీ బ్యాగ్‌లో కుమార్తె మృతదేహంతో..

- అంబులెన్స్ నిరాకరించడంతో 90 కిలోమీటర్లు బస్సులో ప్రయాణించిన గిరిజనుడు
- బీజేపీ పాలిత మహారాష్ట్రలో దారుణ సంఘటన

ముంబై: మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాకు చెందిన గిరిజన దంపతులకు తీవ్ర విషాదం ఎదురైంది. సఖరం (28), అవిత (26) దంపతులు తెలిపిన వివరాల ప్రకారం, వీరిద్దరూ దినసరి కూలీలు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మూడో బిడ్డ కాన్పు కోసం ఇటీవలే సొంతూరుకు వెళ్లారు. ఈ నెల 11న ఆమెకు నొప్పులు రావడంతో అంబులెన్స్ కోసం ఫోన్ చేశారు. కానీ అది రాలేదు. గ్రామంలోని ఆశా వర్కర్ కోసం ప్రయత్నించారు. ఆమె కూడా అందుబాటులో లేదు. చివరికి ఆశా వర్కర్ ఓ ప్రైవేట్ వాహనాన్ని ఏర్పాటు చేసి, ఖోదల ప్రజారోగ్య కేంద్రానికి అవితను తీసుకెళ్లారు. మార్గమధ్యంలో అవిత గర్భంలో కదలికలు వచ్చాయి. పీహెచ్‌సీకి చేరుకున్న తర్వాత గంటకుపైగా వేచి ఉండేలా చేశారు. అక్కడి వైద్యులు మొఖడ గ్రామీణ దవాఖానకు వెళ్లాలని చెప్పారు. అక్కడ ఆమెను ఓ గదిలో ఉంచారు. ఆమె భర్త నిరసన తెలపడంతో పోలీసులను పిలిచి, అతనిని కొట్టించారు. అక్కడి డాక్టర్లు ఆమెను నాసిక్ సివిల్ హాస్పిటల్‌కు వెళ్లాలని చెప్పారు. అక్కడ అంబులెన్స్ లేకపోవడంతో 25 కి.మీ. దూరంలోని ఆసే గ్రామం నుంచి అంబులెన్స్‌ను రప్పించారు. అవిత నాసిక్ దవాఖానకు చేరుకుంది. ఈ నెల 12న రాత్రి 1.30 గంటల ప్రాంతంలో ఆమెకు మృత ఆడ శిశువు జన్మించింది. మృతదేహాన్ని ఆ మర్నాడు సఖరంకు అప్పగించారు. కానీ ఇంటికి మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు అంబులెన్స్‌ను పంపించలేదు. దీంతో సఖరం రూ.20 చెల్లించి ఓ క్యారీ బ్యాగ్‌ను కొని, గుడ్డలో చుట్టిన మృతదేహాన్ని ఆ కవరులో పెట్టి, 90 కి.మీ. దూరంలోని తన స్వగ్రామానికి బస్సులో వెళ్లారు. అక్కడ అంత్యక్రియలు పూర్తి చేశారు. తిరిగి నాసిక్ దవాఖానకు వచ్చారు. అక్కడ అవిత బలహీనంగా ఉన్నప్పటికీ వైద్యులు ఆమెకు మందులు ఇవ్వలేదు. ఇరువురూ కలిసి బస్సులోనే స్వగ్రామానికి చేరుకున్నారు.